


# నవభూమి

జిల్లా అనుబంధం

17 ఏప్రిల్,2025 గురువారం పేజీలు:6

www.epaper.navabhoomi.in


## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు

# పటిష్ట చర్యలు

❑ కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలో ఎక్కువ నిడివి కలిగిన జాతీయ రహదారులతో పాటు, ఆర్అండ్బీ, పంచాయతీ రహదారులు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఐ డి ఓ సి లో రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో ఆస్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరఫున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్‌వో ను ఆదేశించారు. ముందుగా జాతీయ రహదారులు, ఆర్అండ్బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలపై అధ్యయనం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటళ్లను ఎంపిక చేయాలని తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్‌లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశంలో గుర్తించి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకుగాను ప్రమాద దృశ్యాల వీడియోలు, ఫోటోలు ద్వారా ప్రమాదానికి గురైన వారి తల్లిదండ్రులు పడే వేదనను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. రహదారులు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన పోల్స్ మాదిరిగానే జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల్లో ప్రమాదాల నియాత్రలకు అన్ని శాఖలు సమన్వయంగా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి భాస్కర్ నాయక్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ఈ ఈ శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి,జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డి సి హెచ్ ఓ రవిబాబు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను

# ప్రారంభించిన బండారు

**ఎర్రుపాలెం, నవభూమి, ఏప్రిల్ 16:** మండలపరిధిలోని మామునూరు, బనిగడ్లపాడు,జమలాపురం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలనుమధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భం గా ఆయనమాట్లాడుతూ్రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులుపండించిన ప్రతీగింజనుకొనుగోలు చేస్తామన్నారు .రైతులు దళారులనునమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్ర యించుకొని ప్రభుత్వమద్దతు ధర పొందా లని తెలిపారు.ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వ రరావు సన్నరకం వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చే విధంగా చర్యలు తీసు కున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధా కర్ రెడ్డి,జిల్లామార్కెటింగ్ అధికారిఅలీమ్, ఎంపీడీఓ సురేందర్,ఏపిఎం హరి నారా యణ,శీలం శ్రీనివాస రెడ్డి,షేక్ జానీ భాషా, కడియం శ్రీనివాసరావు, శీలంవెంకటరామి రెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి అనురాధ, గూడేటి బాబురావు, పిల్లిబోసుబాబు, బాణ వత్ శ్రీను ,దేవరకొండ శ్రీనివాసరావు, శీలం అక్కిరెడ్డి, వెంకట రామిరెడ్డి, మారబత్తుల మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు



## క్రికెట్ బెట్టింగులకు పాల్పడే వ్యక్తులపై

# ప్రత్యేక నిఘా

❑ బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

❑ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు

❑ నేరసమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు








**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీసు అధికారులతో బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా మార్చి నెలలో విధుల పట్ల అంకితభావంతో పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో ఉన్న కేసులు వివరాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. క్రికెట్ బెట్టింగులు, గంజాయి అక్రమ రవాణా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా పనిచేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ కృషి చేయాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100 నకు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని దొంగతనాల నివారణకై ప్రజలను అప్రమత్తం చేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలియజేశారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి అలసత్వం వహించారాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వ్యక్తులపై నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్ సీఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అకాల వర్షం తడిసిన వరి ధాన్యం



**తల్లాడ, నవభూమి, ఏప్రిల్ 14:** తల్లాడ మండలంలో పలు గ్రామాలలో అకాల వర్షం మరోసారి అన్నదాతను నష్టాలకు గురిచేసింది ఎండలకు తేమశాతం లేకుండా వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటే ఈ అకాల వర్షం వల్ల ఎండకు ఆరబోసిన అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం వర్షం కారణం చేత తడిసిపోయి మంగళవారం నాడు తల్లాడ మండలంలోని ఈదురుగాలితో కూడిన వర్షం తల్లాడ, బిల్లుపాడు, రంగం బంజార, అంజినాపురం, ముద్దనూరు, పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ చేసిన ధాన్యం సుమారు 3000 ఎకరాల నిల్వచేసిన వరిదాన్యం ఈ అకాల వర్షానికి తడిసి ముద్దయింది. కేంద్రాల్లో సరిపడా పట్టా లేకపోవడంతో రైతు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోలేకపోయారు. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడడంతో కోతకు వచ్చిన వారి పూర్తిగా దెబ్బతిన్నది వడ్లు రాలిపోయాయి వరి కంకులు నేలకొరిగాయి. మొత్తంగా రైతులు ఈ వర్షానికి తీవ్ర నష్టాన్ని గురయ్యారు. రైతులందరూ ముక్తకంఠంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ఆడపిల్లకు ఆత్మీయ కానుక





**తల్లాడ, నవభూమి, ఏప్రిల్ 16:** తల్లాడ మండలంలోని అన్నారు బుధవారం ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో 'మా ఇంటి మణి దీపం"కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లకు జన్మనిచ్చిన గోనాదీప్తి కి అధికారులు స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, బేటి బచావో బేటి పడావో ప్రశంసా పత్రాన్ని అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి శివప్రసాద్, ఎంపీడీవో ఎ సురేష్ బాబు, ఏ సి డి పి ఓ జి నవ్య శ్రీ, సూపర్వైజర్ కే సత్యవతి, ఏఎన్ఎం విజయలక్ష్మి, రాంబాయి, గ్రామపంచాయతీ సెక్రటరీ ఎన్ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్లు నాగరత్నం, నాగమల్లేశ్వరి, నాగేంద్ర, వెంకట్ నర్సమ్మ, ఆశా కార్యకర్తలు రాణి, రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ప్రచార కరపత్రం ఆవిష్కరణ

**రామవరం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రచార కరపత్రం ను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాధిస్తున్న ప్రగతిని ఆయన ప్రశంసించారు. గత పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో 96 శాతం ఫలితాల సాధన, గుణాత్మక బోధన, దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా పాఠశాలలో ఖచ్చితంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రామవరం ప్రభుత్వ పాఠశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బీద విద్యార్థులు సంక్షే మార్థం తీసుకుంటున్న అనేక సంక్షే మ కార్యక్రమాలను కొనసాగిచాల్సింది గా హెచ్ఎం ప్రభుదయాల్ ను కోరారు



# మానాల భద్రయ్య - శాంతమ్మల జ్ఞాపకార్థం

■ అంతిమయాత్ర రథం బహుకరణ



**గుండాల ఏప్రిల్ 16 నవభూమి:** గుండాల గ్రామపంచాయతీకి మానాల భద్రయ్య – శాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అంతిమయాత్ర రథం బుధవారం బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గుండాల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, తాహసిల్దార్ మేకల ఇమ్మానియేల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఎవరైనా గోరంత సాయం చేస్తే కొండంతగా ప్రచారం చేసుకునే ఈ రోజుల్లో సేవే మార్గం సేవే లక్ష్యం అనే నినాదంతో మానాల భద్రయ్య – శాంతమ్మల కుమారులు ముందుకొచ్చి గ్రామాభివృద్ధికి ఎనలేని సేవ చేస్తున్నారు, వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మానాల భద్రయ్య కుటుంబం మారుమూల ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఈ ప్రాంత ప్రజలకు ఇతోదికంగా సేవ చేస్తుందని అన్నారు. గతంలో కూడా గ్రామపంచాయతీకి మార్చురీ ఫ్రిడ్జ్ బాక్స్ బహూకరించడం ద్వారా మారుమూల ప్రాంతంలోని ఈ ప్రాంత ప్రజలు 224 మంది ఈ ఫ్రిజర్ బాక్స్ ను ఉచితంగా ఉపయోగించుకున్నారని అన్నారు. ఎవరైనా చనిపోతే దూర ప్రాంతాల నుండి ఫ్రీజర్ బాక్స్ లేకుండా స్థానికంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఆరు లక్షల విలువచేసే అంతిమయాత్ర రథం బహుకరించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. మానాల బ్రదర్స్ గతంలో కూడా వాసవి క్లబ్ మండల ఆర్యవైశ్య సంఘం ద్వారా కరోనా కష్టకాలంలో పేదలకు అండగా నిలిచి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఇబ్బందులకు గురైతే గత ఏడాది సాయనపల్లి, ముత్తాపురం గ్రామ ప్రజలకు అండగా ఉండి ఎరువులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారని, వారి సేవలు మరువలేమన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులను చూసి ఫ్రీజర్ బాక్స్, అంతిమయాత్ర రథం ఉచితంగా బహుకరించడం గొప్ప విషయమని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్యాంసుందర్ రెడ్డి, స్థానిక ఎస్సై రాజమౌళి, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, మానాల బ్రదర్స్ మానాల నారాయణమూర్తి, మానాల వెంకటేశ్వర్లు, మానాల వీరన్న, మానాల ప్రభాకర్, మానాల సతీష్, మానాల శ్రావణ్, మానాల ప్రణీత్, ఆర్యవైశ్య ప్రముఖులు పల్లబోతు సాయిబాబా, గౌరిశెట్టి శ్రీనివాస్, అనుములు వెంకటేశ్వర్లు, పొద్దుటూరి నాగేశ్వరరావు, కండె రమేష్, అను బాబు, బసవయ్య, మాజీ జెడ్పిటిసి రామక్క, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, గుండాల వాసవి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు

# సన్నబియ్యం అన్నం ఎలా ఉందమ్మా

■ టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు

■ సన్న బియ్యం లబ్ధిదారుడు వీరయ్య కుటుంబంతో కలిసి భోజనం

**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న రేషన్ బియ్యం పథకం అమలు పట్ల ప్రజల్లో స్పందన తెలుసుకునే క్రమంలో భాగంగా సన్నబియ్యం లబ్ధిదారుడు సుజాతనగర్ గరీబ్ పేట లో నర్సింగ్ వీరయ్య ఇంట్లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో వెళ్లి టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు భోజనం చేశారు. సన్నబియ్యం అన్నం ఎలా ఉందని తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో డీలర్ దగ్గరకు వెళ్లి సన్న బియ్యం తెచ్చుకొని సంతోషంగా వండుకుని తింటున్నామని లబ్ధిదారులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వసంత చేసిన వంటకాలు ఎంతో రుచిగా ఉన్నాయని సన్న బియ్యం అన్నం ఎంతో రుచిగా ఉందన్నారు. మంచి సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పేదలకు అందజేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో మహిళల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా, లబ్ధిదారులందరికి అవి అందేలా చూడలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఆప్యాయంగా తనను ఇంటికి భోజనానికి పిలిచిన నర్సింగ్ వీరయ్య వసంత దంపతులకు నూతన వస్త్రాలు ఇచ్చి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కరీం పాషా, ఓబీసీ సెల్ బొబ్బల వెంకట్ యాదవ్, బీసీ సెల్ అధ్యక్షులు కసనబోయిన లక్ష్మణ్, నర్సింగ్ బిక్షం, రెడ్డిమల్ల వెంకన్న, పెద్ద వెంకన్న, రాములు, బి రవి, ఉపేందర్, వల్లపు పద్మ, వీరమ్మ, కృష్ణవేణి, సోషల్ మీడియా మండల కో-ఆర్డినేటర్ బిరెల్లి వీరభద్రం, మార్తి వెంకన్న, కసనబోయిన రామ్మూర్తి మధు, తిరుపతి, శ్రీను, వెంకటేష్, వేణు మరియు స్థానికులు పాల్గొన్నారు



# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



**జూలురుపాడు,ఏప్రిల్ 16 (నవభూమి ప్రతినిధి)** కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐ ఎన్ టి యూ సి యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు నిరసన తెలిపారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు,ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రకారంగా పే స్కేల్,ఉద్యోగ భద్రత,హెల్త్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనంతరం తాహశీల్దార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు మూడ్ రమేష్,రవి, భద్రం, హరికిషన్, బాల్యా, నాగమణి, నాగేష్,జగదీష్,నరేష్,లక్ష్మి,షరిప్ తదితరులు పాల్గొన్నారు



## కళ తప్పిన పల్లె ప్రకృతి వనం
## నాడు కళ కళ - నేడు వెల వెల









భూక్యా పద్మ, సంజయ్ నగర్ మాజీ సర్పంచ్

**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వ పాలసీల ప్రకారం అధికారుల పని తీరు ఉంటుంది. ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తే అధికారులు దాని ప్రకారం వ్యవహరిస్తారు. దీనికి చక్కటి ఉదాహరణ లక్ష్మీదేవిపల్లి లోని మూడు పంచాయతీల పల్లె ప్రకృతి వనం. గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.వి రెడ్డి హయాంలో లక్ష్మీదేవిపల్లి, సంజయ్ నగర్, హమాలి కాలనికి కలిపి ఉమ్మడిగా కొన్ని లక్షలు వెచ్చించి పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది రాకపోకలు, సాయంత్రం, మార్నింగ్ వాక్ తో కళ కళ లాడేది. ఇప్పుడు నిర్వహణ సరిగ్గా లేక అధికారులు, ఆయా పంచాయతీ సిబ్బంది పట్టించుకోక వెల వెల బోతోంది. నడక దారిలో చెట్లు అడ్డంగా పెరిగాయి. మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి మూడు పంచాయతీలకు ఒక నడక దారి, వేర్వేరుగా మూడు పంచాయతీ లకు మూడు వేర్వేరు నడకదారులున్నాయి. హమాలీ కాలనీ నడకదారి నడిచే వీలులేకుండా మారింది. ఇప్పటికైనా అధికారులు, ఈ పల్లె ప్రకృతి వనం పై శ్రద్ధపెట్టి నడిచేందుకు వీలుగా తీర్చి దిద్దాలని సంజయ్ నగర్ మాజీ సర్పంచ్ భూక్యా పద్మ డిమాండ్ చేశారు

## ఆకాల వర్షాలతో నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి



**గార్ల, నవభూమి, ఏప్రిల్ 16:** ఆకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు రాగం రమేష్ డిమాండ్ చేశారు. గార్ల సిపిఐ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు కూలీ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలతో వరి, మిర్చి పంటలు పూర్తిగా తడిసి పోయి రైతులను కోలుకోలేని విధంగా చేసిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కోనుగోలు చెయడం తో పాటు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జనార్ధన్, భీమ్లా, బిక్షం, తదితరులు పాల్గొన్నారు

# సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ గని తొలిమెట్టు

- ప్రజా పాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణి విస్తరణ
- ఒడిశాలో సింగరేణి గని ఏర్పాటు..యావత్తు తెలంగాణకే గర్వకారణం
- 13 దశాబ్దాల సింగరేణి చరిత్రలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం
- ఒడిశాలో నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రత్యేక చొరవ వల్లే నైనీ ప్రారంభం
- సింగరేణి సీఎండీ బలరామ్



**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశా రాష్ట్రంలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం మహాత్మా జ్యోతి రావ్ ఫూలే ప్రజా భవన్ నుంచి ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చువల్ గా ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థ కే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమైన సందర్భం అన్నారు. ఈ బొగ్గు బ్లాక్ను సింగరేణి కి కేటాయించి తొమ్మిది ఏళ్ళు అయినప్పటికీ వివిధ రకాల అనుమతులు అందడంలో జాప్యం వల్ల ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. నేడు ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగు గా ఆయన అభివర్ణించారు.ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుందన్నారు.త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్,ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి,స్థానిక ఎమ్మెల్యే అగస్థీ బెహరా,ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

అంగూల్ అభివృద్ధి కి పూర్తి కృషి..గత ఏడాది జులైలో తన ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి తాను ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని,ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని,కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని,సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు.

అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీ కి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ ప్రజలందరి తరపున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున ఒడిశా రాష్ట్ర యావత్ ప్రజానీకానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని,ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. నైనీ బొగ్గు గని వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని,ఈ గనికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కి,సింగరేణి సీఎండీకి తన శుభాకాంక్షలు తెలియజేశారు. నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చూపిన ప్రత్యేక చొరవ,సహకారం వలన నైనీ బొగ్గు బ్లాక్ ను ఈ రోజు ప్రారంభించుకోగలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి,విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు.

కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్) ఎస్డి.ఎం.సుభానీ పాల్గొనగా..నైనీ నుంచిసంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.






## ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్‌కు ఉత్తమ ప్రశంసా పత్రం

**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో బుధవారం జరిగిన నెలవారీ క్రైమ్ సమీక్షా సమావేశంలో మార్చి నెలలో ఫోక్సో కేసులో నిందుతుడికి జీవిత ఖైదు తో పాటు వివిధ కేసులలో నిందితులకు శిక్షలు పడే విదంగా కృషి చేస్తు డి.సి.ఆర్.బి నుండి జిల్లా కోర్టులో పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ కు ఎస్పీ రోహిత్ రాజు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, డి.సి.ఆర్.బి డిఎస్పీ ఎన్ మల్లయ్య స్వామి, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాస్, డి.సి.ఆర్.బి సిబ్బంది ఎస్సై ప్రవీణ్ కుమార్ కు అభినందనలు తెలిపారు



# సింగరేణి మెయిన్ హాస్పిటల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐటియుసి ఆధ్వర్యంలో సీఎంఓకి వినతి



**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన పని భారంకు అనుగుణంగా రోజువారి విధులకు తీసుకునే కార్మికుల సంఖ్యను పెంచాలని, రక్షణ చర్యలు చేపట్టాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ కిరణ్ రాజ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టఫర్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్, క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు అరకొర మస్టర్లతో, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి నెలకు కనీసం 26 మాస్టర్లు వచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. సింగరేణి మెయిన్ హాస్పిటల్ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు పెరుగుతున్న పని భారాన్ని పరిగణలోకి తీసుకోవాలని,వారికి మెరుగైన వైద్యం,సరైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, విజయ్, రమేష్, రాంబాబు, లలిత, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ ప్రయోజనాల కోసమే విమర్శలు చేసే వారిని నేను పట్టించుకోను

## అంబేద్కర్‌లాంటి మహోన్నత వ్యక్తికి క్షమాపణ చెప్పడంలో ఎలాంటి భేషజాలు లేవు

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 16, (నవభూమి ప్రతినిధి) :** రాజకీయ ప్రయోజనాల కోసమే విమర్శలు చేసే వారిని నేను పట్టించుకోనని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ బండి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సభపై విష ప్రచారాలు చేసి రాజకీయ లాభాలు పొందాలన్నదే లక్ష్యంగా కొన్ని చోటా నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో నా వెనుక భాగంలో అంబేద్కర్ ఫోటో ఉండగా నేను కూర్చున్నానన్న సంఘటనపై కొందరు క్షమాపణ కోరాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఎటు వంటి అవమానాత్మక ఉద్దేశంతో జరిగినది కాదని, యాదృచ్ఛికంగా జరిగిన విషయం మాత్రమేనన్నారు. డాక్టర్ అంబేద్కర్ అంటే నాకు అపారమైన గౌరవం అని.. ఆయన ఒక మహాశయుడు, ప్రపంచ మేధావి, ఆయన స్ఫూర్తితోనే 2009 లోనే నా సొంత నిధులతో లింగంపల్లిలో దళిత సోదరులతో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం జై బాపూ – జై భీమ్ – జై సంవిధాన్ నినాదాలతో ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చనీయబోమని ప్రతిజ్ఞ చేశారు. ఇటువంటి విస్తృతమైన



ప్రయత్నాలను పక్కనబెట్టి, ఒక చిన్న యాదృచ్ఛిక సంఘటనను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం తప్పుని భావిస్తున్నా అని అన్నారు. అంబేద్కర్ పేరు చెప్పుకుంటూ విమర్శలు చేసే ఈ చోటా నాయకులు, ఆయన సిద్ధాంతాల అమలులో ఏం చేశారో సమాజానికే తెలియాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ లాంటి మహోన్నత వ్యక్తికి నిజంగా అవసరం ఉంటే, క్షమాపణ చెప్పడంలో ఎలాంటి భేషజాలు ఉండబోవు అన్నారు.

# అడవుల సంరక్షణ ప్రజలందరి బాధ్యత

- వన్యప్రాణులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు
- అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ భీమా నాయక్





**ఏన్కూరు, నవభూమి,ఏప్రిల్ 16:** అడవుల సంరక్షణ ప్రజలంతా బాధ్యత తీసుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ వరంగల్ జోన్ బీమా నాయక్ కోరారు. స్థానిక వెదురు డిపో బహిరంగ వేలంపాట సందర్భంగా బుధవారం ఆయన హాజరై వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 63 వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయని తెలిపారు. అడవుల సంరక్షణకు సీసీ కెమెరాలు, రాత్రిపూట గస్తీ బృందాల ద్వారా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడవుల శాతాన్ని పెంచేందుకు గత కొన్ని ఏళ్ల నుండి పెద్ద ఎత్తున మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నర్సరీలు, ప్లాంటేషన్లు, ప్రభుత్వ స్థలాల్లో, రోడ్ల వెంట మొక్కలు నాటి పచ్చదనం వ్యాప్తి కోసం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 31 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించమన్నారు. వన్యప్రాణాలను వేటాడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు హెచ్చరించారు. అశ్వరావుపేట మండలంలో వన్యప్రాణులను వేటాడేందుకు ఉపయోగించిన నాటు తుపాకులు స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తులను జైలుకు పంపినట్లు తెలిపారు. విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను వేటాడే వారిపై జిల్లా కలెక్టర్ త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్, ఎఫ్ ఆర్ వో ఉమా, డిఆర్ఓ శ్రీనివాస్, బీట్ అధికారి సైదులు పాల్గొన్నారు

# రాజులదేవరపాడులో 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమం







**ఎర్రుపాలెం, నవభూమి, ఏప్రిల్ 16 :** మండల పరిధిలోని రాజులదేవరపాడు గ్రామంలోబుధవారం మాఇంటి మహాలక్ష్మి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికిచెందినదుద్దుకూరుఅనిల్– జ్యోతి దంపతులకు కుమార్తె భవ్యశ్రీ జన్మించింది.ఎంపీడీవో బి సురేందర్, మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ ఆలీం, ఎసిడిపిఓ డి కృష్ణ శ్రీ,డాక్టర్ ప్రశాంత్ బుధవారం రాజుల దేవరపాడులోని చిన్నారి భవ్యశ్రీ ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు,తాతయ్య,నానమ్మలకు స్వీట్లు,పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి సాలువాకప్పి సన్మానించి ప్రశంసా పత్రాన్ని తల్లిదండ్రులకుఅందించారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ముజాహిద్దీన్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మా ఇంటి మణిదీపం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమని అన్నారు. ఆడబిడ్డపుట్టడం అదృష్టమని,ఆడపిల్ల నుచదువనిద్దాం–ఎదగనిద్దాం అన్నారు. ఆడబిడ్డలపై వివక్ష చూపకుండా మగ పిల్లలకు సమానంగా పెంచి వారికి అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలన్నారు. ఆడపిల్లల ఉన్నతికి ప్రభుత్వాలు ఎన్నో ప్రత్యేకపథకాలనుఅమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతరం మధిర సెక్టార్ లోని ఎర్రుపాలెం మండల ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం రాజులదేవరపాడు,గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీడిపిఓ కృష్ణ శ్రీ బాలింతలకు,గర్భిణీలకు చిరుధా న్యాల ప్రాముఖ్యత గురించి, పోషకఆహా రాల గురించి అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు,కార్యక్రమానికి హాజరైన వారితో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకఅధికారి అబ్దుల్ అలీమ్, ఎంపీడీఓ బి సురేందర్, పీహెచ్సీ వైద్యులు ప్రశాంత్, ఏసిడిపిఓ కృష్ణ శ్రీ,సూపర్వైజర్లు సరిత, సునీత, మధులత, అంగన్వాడి టీచర్స్ మందడపు రాజేశ్వరి, హెల్పర్స్, ఆశా వర్కర్లు, గ్రామ దీపికలు ,గర్భిణీలు, బాలింతలు,గ్రామస్తులు పాల్గొన్నారు

# కులం పేరుతో దూషిస్తున్నారని విద్యార్థిని ఆరోపణ

- రామచంద్రుని పేట హాస్టల్ హెచ్ఎం వేధింపులు

**భద్రాచలం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** దుమ్ముగూడెం మండలం. రామచంద్రుని పేట గర్ల్స్ ఆశ్రమ పాఠశాల యందు హెచ్ఎం. ఎస్టీ విద్యార్థినీల పట్ల కులం పేరుతో ఇబ్బంది పెడుతున్నారని వారికి నచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఒక విద్యార్థిని సెల్ఫీ వీడియో పిడిఎస్ యు నాయకులకు పంపడం జరిగిందని నాయకులు మునిగడ్డ శివ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాలికల హాస్టల్స్ లో మగ టీచర్స్ ఉండకూడదని అనేక సందర్భాల్లో ఐటీడీఏ అధికారులకు చెప్పినప్పటికీ హాస్టల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థినీ అని కూడా చూడకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతూ వేధిస్తూ అనేక సందర్భాల్లో జరిగి ఉన్నప్పటికీ జరిగినప్పుడు



అధికారులు మాత్రమే తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని ఆశ్రమ పాఠశాల విద్యను ఊబిలోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నిటికీ ఐ టి డి ఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణమని అన్నారు. ట్రైబల్ టీచర్లని నియమించాలని కోరారు ఇప్పటికైనా స్పందించి హాస్టల్లో కులాల పేరుతో జరుగుతున్న వివాదాల్ని విచారణ చేయాలని, విద్యార్థులు పట్ల ఐక్యత పెంచాలని అన్నారు.

## పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలి




**గార్ల, నవభూమి, ఏప్రిల్ 16:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించడం తో పాటు కూలీలకు రోజు వారి వేతనం 600 రూపాయలివ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. గార్ల మండలం సత్య నారాయణ పురం, చిన్న కిష్టాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను రైతు కూలీ సంఘం సభ్యులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలను దృష్టి లో పెట్టుకొని కొలతలతో సంభందం వేతనాలు చెల్లించాలని, ప్రతి కూలీకి రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో మరణించిన కూలీకి 50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాధా, భారతి, కళావతి, నాగేశ్వరరావు, రామకృష్ణ, మల్లికాంబ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు

## సర్వేల పేరుతో కాలయాపన ఎందుకు?


### ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడికి అత్తమామల, తల్లిదండ్రుల ఆధార్ కార్డుతో లింక్ ఎందుకు?



**కొత్తగూడెం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** ఇందిరమ్మ గృహాల నిర్మాణం కోసం అధికారులు మళ్లీ సర్వే చేయడం దేనికని సేవ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ప్రశ్నించారు. సర్వేపై అధికారులు ఇది కేంద్ర ప్రభుత్వ యాప్ సంబంధించిందని కొంతమంది,మళ్లీ రీ సర్వే చేస్తున్నామని కొంతమంది చెప్తుండడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. లబ్ధిదారుల జాబితా ప్రకటించి అందులో నుంచి అర్హుల జాబితా ప్రకటించడంలో కాలయాపన దేనికోసమన్నారు.వార్డుల్లో కొంతమందికే అధికారులు ఫోన్లు చేస్తుండడం వెళ్లి వివరాలు సేకరిస్తుండడంతో ప్రజలు గందరగోళపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆనర్హులు అవకాశం ఇస్తే నిరుపేదలతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని ఇండ్ల నిర్మాణం ప్రారంభించేలా ప్రయత్నం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ - ఏప్రిల్ 16:(నవభూమి ప్రతినిధి)** నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో శ్రీమతి సోనియా గాంధీ,శ్రీ రాహుల్ గాంధీలపై బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా చార్జిషీట్ లో పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ లోని ఈ.డి కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ,రాజ్యసభ సభ్యులు అనిల్



కుమార్ యాదవ్,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## డంపింగ్ యార్డ్‌ను తరలించి గోదావరి పవిత్రతను కాపాడాలి

### ■ స్థానిక సమస్యల సిపిఎం ఆధ్వర్యంలో సర్వే

**భద్రాచలం ఏప్రిల్ 16 నవభూమి ప్రతినిధి:** ఊరిలో సేకరించిన చెత్త మొత్తం తీసుకువచ్చి గోదావరి ఒడ్డున వేయడంతో గోదారి నీరు కలుషితమై హానికరంగా తయారవుతుందని పంచాయతీ అధికారులు వెంటనే డంపింగ్ యార్డ్ ను గోదారి కరకట్ట వద్ద నుండి తరలించి నదీ పవిత్రతను కాపాడడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలో నివాస ప్రాంతాలలో స్థానిక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల సర్వే బుధవారం ఒకటో వార్డు రామాలయం ఏరియా ప్రాంతంలో కొనసాగింది ఈ సందర్భంగా పలు స్థానిక సమస్యలను స్థానిక సమస్యలను సిపిఐ బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచల సీతారాముల దేవాలయం దాని పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రజలు రాత్రులు నిద్రపోయే పరిస్థితి కూడా లేదని విపరీతమైన పొగతో వేసుకున్న ఇల్లు మొత్తం కూడా పొగతో నిండిపోయి ఊపిరి ఆడక ఊపిరితిత్తులు పాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివసించే కొంతమందికి క్యాన్సర్ కూడా వచ్చినదని ఊళ్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు అన్నిటిని కాల్చడం వల్ల క్యాన్సర్ కారకాలు ఎక్కువ అవుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని విమర్శించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సుందరయ్య నగర్ లో ఏర్పాటు చేసిన అధునాతనమైన డంపింగ్ యార్డ్ ను నిర్మించి తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి వాటిని ఫైరింగ్ పిల్స్ గా మారుస్తున్నామని చెప్పినప్పటికీ అది



పూర్తిస్థాయిలో అమలు కానందువలన ఇప్పటికీ రామాలయ పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఒకటి, రెండు, మూడు, నాలుగు, వార్డుల ప్రజలు విపరీతమైన బాధలు పడుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీకి ఇన్చార్జిగా ఉన్నటువంటి, పిఓ , దీనిపై దృష్టి సారించి గోదావరి నదిలో రామాలయ పరిసరాలలో భద్రాచలంలోని వ్యర్థ పదార్థాలు అన్ని వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భద్రాచలంలోనీ మురుగు నీరు యాత్రికులు స్నానాలు చేసే రేవు వద్ద కలవడంతో ఎంతో భక్తి భావంతో వచ్చే యాత్రికులు మురుగునీటిలో స్నానాలు ఆచరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నర్సారెడ్డి అన్నారు. వెంటనే ఆ డ్రైనేజీ వాటర్ ని కిందకి మళ్ళించాలని గోదావరి నీటిలో కలవ కుండ చర్యలు తీసుకోవాలని లేకపోతే స్థానిక ప్రజలను సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరా టా లు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ధనకొండ రాఘవయ్య, శాఖ కార్యదర్శి, ఆది, వెంకన్న, పోసి స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్

### ■ ముఖ్యఅతిథిగా అంగన్వాడి సిడిపిఓ రేవతి, సూపర్వైజర్ సావిత్రి













**అశ్వాపురం ఏప్రిల్ 16 నవభూమి:** అశ్వాపురం మండలం మిట్టగూడెం పంచాయతీ కళ్యాణపురం సెక్టార్ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా బుధవారం సామూహిక సీమంతాలు, గర్భిణీలకు ఒడి నింపారు,చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిడిపిఓ రేవతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలలో 0,6 సంవత్సరముల పిల్లలు, తల్లులకు పోషక ఆహారం లోపం లేకుండా వారు తీసుకునే ఆహారం సంపూర్ణంగా పరిశుభ్రంగా ఉండే విధంగా జాగ్రత్తలు వారికి అవగాహన తెలియజేశారు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు, పాలు, మురుకులు, బాలామృతం, గుడ్లు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట, పాటలతో ప్రాథమిక విద్య నేర్పాలని, పౌష్టికాహారం సమయానికి అందించాలని కోరారు. చిరుధాన్యాల వల్ల అందే పోషక విలువలను తెలియజేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క మహిళలు ఆకుకూరలు, పాలు, పండ్లు రాగులు, సజ్జలు, కొర్రలు, మొదలగు త్రుణ ధాన్యాలలో ఐరన్ పిండిపదార్థాలు కలిగిన ఆహారం తినాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సావిత్రి, 24 గ్రామ పంచాయతీలు అంగన్వాడీ టీచర్స్, కే నాగమణి, టి వేణి, డి సునీత, టీ మాలతి, హేమలత, కళ్యాణి, వెంకట లక్ష్మి, సరోజినీ, నాగమణి, దేవ కుమారి, కోటేశ్వరి, అరుణ, ప్రభావతి, శారద, రమాదేవి, సుజాత, నాగమణి, సరిత, శారద, బేబీ, చుక్కమ్మ, సారమ్మ, పి శారద, గురవమ్మ, ఆశా వర్కర్ అరుణ, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు

